క్లుప్తంగా

వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

గుడివాడరూరల్: ఈ నెల తొమ్మిది నుంచి 22వ తేదీ వరకు గుడివాడ–ముదినేపల్లి రోడ్డులో మల్లాయపాలెం వద్ద ఉన్న భీమవరం రైల్వే ట్రాక్ మరమ్మతుల నేపథ్యంలో గేటు మూసివేయడంతో వాహనదారులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టామని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎస్.చంటిబాబు శనివారం తెలిపారు. బంటుమిల్లిరోడ్డులోని దొండపాడు కాల్వ వద్ద వాహనాల రాకపోకలను వేర్వేరు మార్గాల ద్వారా తరలించేందుకు సిబ్బందితో కలసి ఆయన పర్యవేక్షించారు.

ఉచిత వైద్యశిబిరం



పమిడిముక్కల: మండలంలోని ఐనంపూడిలో రోటరీ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో కంటి, దంత, బీపీ, షుగర్, జలుబు, దగ్గు, మోకాళ్ల నొప్పిలకు సంబంధించి 75 మంది రోగులకు పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందజేశారు. అవసరమైన వారికి ఉయ్యూరు కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని రోటరీ క్లబ్ అధ్యక్షుడు చొప్పరపు నాగ సుబ్రమణ్యం తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏనుగ బేబి, కేసీపీ మేనేజర్ రామచంద్రరావు, రోటరీ కార్యదర్శి అమీర్ మీర్జా పాల్గొన్నారు.

గంగానమ్మ ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ

గుడివాడరూరల్: మండలంలోని బొమ్ములూరులో వందేళ్ల నాటి శ్రీగంగానమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళీ, మాజీ సర్పంచ్ లక్ష్మీ, భక్తులు శనివారం నిర్వహించారు. బొమ్ములూరులోని అంబేడ్కర్ పార్కు వెనుక ఉన్న ఆలయ నిర్మాణ స్థలంలో వేదపండితులు ఆధ్వర్యంలో శాస్త్రోక్త పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితుడు వెంకటరమణ, గ్రామస్తులు కుమారస్వామి, నాంచారయ్య, శేషగిరి, నాని, ఆజాద్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు బెనర్జీకి సన్మానం



కైకలూరు: శ్రీశ్రీ కళావేదిక 151వ కార్యక్రమం ఏలూరు మహాలక్ష్మీ గోపాలస్వామి కల్యాణ మండపంలో శనివారం జరిగింది. నాన్ స్టాప్ ట్రాక్ సింగింగ్‌లో కై కలూరు మండలం గోపవరం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు, సహజ కవి, సాహితీరత్న దండే బెనర్జీ స్వీయరచన 'పిల్లలం బడిపిల్లలం.. అమ్మానాన్నల ఆశలం.. భవితవ్యానికి వారసులం' అనే గీతాన్ని గానం చేశారు. నిర్వాహకులు, కవులు, కళాకారులు, గాయకుల ప్రశంసలందుకున్న బెనర్జీకి 'స్వర కిరీటి' జాతీయ ప్రతిభా పురస్కారంతో సత్కరించారు.

మాజీ సర్పంచ్‌కు కైలే పరామర్శ

పమిడిముక్కల: హనుమంతపురం మాజీ సర్పంచ్ పరుచూరి విజయరాణి కుమారుడు వెంకటేశ్వరరావు(53) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ శనివారం హనుమంతపురం వెళ్లి వెంకటేశ్వరరావు మృతదేహానికి పూలమాలేసి నివాళులర్పించారు. విజయరాణిని ఓదార్చారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్, మాజీ ఎంపీపీ శొంఠి వెంకటేశ్వరరావు, సర్పంచ్ కలపాల రాంబాబు, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న భక్తులకు అన్నసమారాధన

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా స్వామిని దర్శించుకునేందుకు శనివారం భక్తుల సందడి అధికమైంది. భక్తులు తమ మొక్కులను భక్తి ప్రపత్తులతో తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మీ దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

హాస్టల్లో ఫ్రెషర్స్‌డే వేడుకలు

ముదినేపల్లి రూరల్: స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో వార్డెన్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు విజయకుమార్‌ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. వసతిగృహాల్లోని విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. విద్యార్థులకు క్రీడా పరికరాలు, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయుడు సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

ఆ రోడ్డు మీద ప్రయాణం నరకప్రాయం!





గుంతలమయంగా మారిన పుట్టగుంట-చేదుర్తిపాడు ఆర్‌అండ్‌బీ రోడ్డు

- అధ్వానంగా మారిన పుట్టగుంట–చేదుర్తిపాడు రోడ్డు
- కూటమి నేతల మట్టి అమ్మకాలతో రూపుకోల్పోయిన రోడ్డు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

గుడివాడరూరల్: పుట్టగుంట నుంచి ఉంగుటూరు మీదుగా గన్నవరం వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా మారింది. అడుగడుగునా గుంత, లేచిన రాళ్లతో వాహనదారులకు చుక్కలు చూపిస్తోంది. రోడ్డును బాగు చేయాలని పాలకులు, అధికారులకు పరిసర గ్రామాల ప్రజలు మొరపెట్టుకున్నా పట్టించుకున్న నాథుడే లేడని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. నందివాడ మండలంలోని పుట్టగుంట నుంచి గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లేందుకు ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డుగా ఉంది. ఈ మార్గం ద్వారానే ఎన్నో గ్రామాలకు తక్కువ దూరంలో ప్రయాణించే సౌకర్యం ఉంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గన్నవరం ఎమ్మెల్యేగా ఉన్న వల్లభనేని వంశీ కృషి వలన కొయ్యగూరపాడు నుంచి గన్నవరం వరకు రోడ్డును అభివృద్ధి చేశారు. కొయ్యగూరపాడు నుంచి పుట్టగుంట వంతెన వరకు రోడ్డు అభివృద్ధికి అప్పటి గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) నిధుల మంజూరుకు కృషి చేశారు. ఎన్నికలు సమీపించడం, ప్రొటోకాల్ వలన నిధులు మంజూరుకు ఆటంకం ఏర్పడింది. ఎన్నికల సమయంలో గుడివాడ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెనిగండ్ల రాము ఎన్నికల్లో తాను గెలిచి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆరు నెలల్లోనే రోడ్డును అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

రోడ్డు పరిస్థితి దారుణం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఎమ్మెల్యేగా వెనిగండ్ల రాము గెలవడం జరిగి ఏడాది దాటినా రోడ్డు పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడ మాదిరిగానే ఉంది. ముఖ్యంగా పుట్టగుంట వంతెన వద్ద నుంచి చేదుర్తిపాడు వరకు రోడ్డు పరిస్థితి దారుణంగా మారింది. అడుగడుగునా గుంత, కాలు కదిపితే లేచిన రాళ్లు, నడవటానికి సైతం ఇబ్బందికరంగా మారింది. ముఖ్యంగా ఒడ్డులమెరక నుంచి చేదుర్తిపాడు వరకు కిలోమీటరు మేర రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. భారీ వాహనాలు, కనీసం ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి సైతం వీల్లేని విధంగా మారింది. అయితే రోడ్డుపై వెళ్లడానికి వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి.

కూటమి నేతల స్వార్థంతో రోడ్డు ధ్వంసం

అధికారంలోకి వస్తే రోడ్డును ఆరు నెలల్లో అభివృద్ధి చేస్తామని కూటమి నేతలు మాటలను విస్మరించడమే కాకుండా రోడ్డును ధ్వంసం కావడానికి ఇతోధికంగా మట్టి అక్రమార్కులతో చేతులు కలిపి రోడ్డును మరింత ధ్వంసం చేశారని పరిసర ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డు వెంబడి బుడమేరు డ్రెయిన్ ఉండటం వేసవి సమయంలో కూటమి నేతలు బుడమేరు ఆధునికీకరణ పేరిట కరకట్టలను పటిష్టం చేయాల్సిన మట్టిని రాత్రి, పగలు తేడా లేకుండా నిబంధనలకు విరుద్ధంగా గన్నవరం, గుడివాడ, పెదపారుపూడి తదితర ప్రాంతాలకు భారీ టిప్పర్లతో ఈ రోడ్డు వెంబడే తరలించుకుపోయారు. ఫలితంగా రోడ్డు మరింత దారుణంగా మారి ప్రయాణాలకు పనికి రాకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు కళ్లు తెరచి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి రోడ్డును అభివృద్ధి చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ప్రయాణం అంటనే భయం

పుట్టగుంట నుంచి చేదుర్తిపాడు వెళ్లే రోడ్డు పేరు చెబితే భయమేస్తుంది. ఎక్కడ చూసినా పెద్ద గుంతలు. ఈ రోడ్డుపై ప్రయాణం చేస్తే ఎక్కడ ప్రమాదాల బారిన పడుతామోనని భయపడుతున్నాం. చాలా కాలంగా రోడ్డు పరిస్థితి ఇదేవిధంగా ఉంది. అధికారులు, పాలకులకు తెలిపినా పట్టించుకోవడం లేదు.

– పి.నాగేశ్వరరావు, ఒడ్డులమెరక గ్రామస్తుడు

రాత్రి సమయాల్లో ప్రయాణిస్తే ప్రాణాలు గాల్లోకే..

రోడ్డు వెంబడి ఒడ్డులమెరక నుంచి చేదుర్తిపాడు వరకు ఉన్న రోడ్డు ప్రయాణానికి వీల్లేని విధంగా గుంతలు పడింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రయాణించలేని విధంగా రూపురేఖలు మారిపోయింది. అక్రమ మట్టి తోలకాల వలన రోడ్డు పరిస్థి మరింత దిగజారింది. ఎవరైనా రాత్రి సమయాల్లో రోడ్డుపై ప్రయాణిస్తే ఆదమరిచారో ప్రాణాలు గాల్లో కలిసిపోయే ప్రమాదం పొంచి ఉంది.

– ఎం.చంటి, వాహనదారుడు

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యం



బీవీ రావును సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

కైకలూరు: క్షేత్ర స్థాయిలో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు.

రాష్ట్ర మేధావుల (ఇంటిలెక్చువల్) విభాగ కార్యదర్శిగా నియమితులైన బుసనబోయిన వెంకటేశ్వరరావు (బీవీ.రావు) శనివారం కైకలూరు పార్టీ కార్యాలయంలో డీఎన్నార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డీఎన్నార్, నాయకులు బీవీ.రావును సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సింగంశెట్టి రాము, జిల్లా బూత్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పంజా నాగు, నాయకులు సమయం రామాంజనేయులు, బుసనబోయిన శ్రీనివాస్, కరేటి రాంబాబు, కన్నా బాబు, బుర్ల కిరణ్, పిర్దోస్‌ఖాన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ హామీల అమలు కోసం పోరాటం



మహాసభలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్

కలిదిండి (కైకలూరు): ఎన్నికల ముందు టీడీపీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున కార్మిక పోరాటాలు నిర్వహించాల్సి వస్తుందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎస్‌వీడీ.ప్రసాద్ హెచ్చరించారు. కలిదిండిలో సీఐటీయూ ఐదవ మండల మహాసభ శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటుతున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. పెరిగిన ధరలతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కనీస వేతనాలు పెంచడం లేదన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని కోరారు. అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రైవేటీకరణ విధానాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వ సంస్థలన్నీ నిర్వీర్యం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఐదువేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తున్నా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడకుండా మౌనం వహించడం దుర్మార్గమన్నారు. సీఐయూటీ మండల అధ్యక్షురాలు హబీదా బేగం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎస్.మహంకాళి, రైతు సంఘం నాయకులు వి.భాస్కరరావు, సీఐటీయూ మండల కార్యదర్శి జే.మహేష్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కుమార్‌రాజా

తోట్లవల్లూరు: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మచిలీపట్నం పార్లమెంటు సభ్యుడు వల్లభనేని బాలశౌరి అన్నారు. తోట్లవల్లూరు శివారు అంబేడ్కర్ నగర్‌లో సీఎస్ఆర్ ఫౌండేషన్ నిధులు రూ.32 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ భవనం, స్థానిక దళితవాడలో రూ. 45 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ భవనాలను ఆయన పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాతో కలిసి శనివారం రాత్రి ప్రారంభించారు. అదేవిధంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన క్యాన్సర్ స్క్రీనింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పాములలంక–తోట్లవల్లూరు మధ్య కృష్ణానదిపై వంతెన నిర్మాణానికి పాటుపడతామన్నారు. కంకిపాడు–గుడివాడ మధ్య ఆరు లైన్ల రహదారిని రూ. 600 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి తదితరులు పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంక్‌లో పడి గేదె మృతి



కలిదిండి(కైకలూరు): ప్రమాదవశాత్తూ సెప్టిక్ ట్యాంక్‌లో పడి చూడి గేదె మృతిచెందిన ఘటన కలిదిండి మండలం కాళ్లపాలెం ఇందిరాకాలనీలో శుక్రవారం రాత్రి జరిగింది. కైకలూరు అగ్నిప్రమాక సిబ్బంది కథనం మేరకు మండ మణికంఠకు చెందిన చూడి గేదె సమీపంలోని పాడుబడిన గృహం వద్దకు మేత తినడానికి వెళ్లింది. పాత సెప్టిక్ ట్యాంకుపైకి ఎక్కింది. గేదె బరువుకు అది ఒక్కసారిగా కుప్పకూలడంతో గేదె అందులో పడి ఊపిరాడక మృతిచెందింది. గేదెను బయటకు తీసేందుకు అగ్నిమాపక సిబ్బంది చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో చివరకు జేసీబీ యంత్రంతో సెప్టిక్ ట్యాంక్ పగలగొట్టి గేదెను బయటకు తీశారు. మృతిచెందిన గేదె రూ.90 వేలు ఖరీదు చేస్తుందని గ్రామస్తులు తెలిపారు.

వర్షంతో ప్రజల హర్షం



గుడ్లవల్లేరు: వర్షాకాలంలో మండు వేసవిని తలపిస్తున్న ఎండలతో సతమతమవుతున్న తరుణంలో శనివారం గుడ్లవల్లేరులో కురిసిన వర్షంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ వర్షంతో వాతావరణం కాస్తా చల్లబడింది. దీంతో ఎండలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు ఈ చల్లని వాతావరణానికి హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకున్నారు.

నేడు ఉచిత మధుమేహ వైద్యశిబిరం

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. వైద్య పరీక్షల అనంతరం అవసరైన రోగులకు 15 రోజులకు సరిపడా ఉచిత మందులను పంపిణీ చేయనున్నట్లు లయన్స్ చైర్మన్ పెరుమాళ్ల శనివారం తెలిపారు.

లాజరుకు సత్కారం



మండవల్లి: తపాలా శాఖలో అంకితభావంతో విధులు నిర్వహించి ఉత్తమ ఉద్యోగిగా అందరి మన్ననలను పొందిన గుంపుల లాజరు ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం రాత్రి ఆయన్ను ఘనంగా సత్కరించి పోస్టల్ ఉద్యోగులు వీడ్కోలు పలికారు. పోస్ట్‌మ్యాన్‌గా, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌గా లాజరు తపాలశాఖకు సేవలందించారని ఉద్యోగులు కొనియాడారు.

ఘనంగా శ్రీకృష్ణ మందిర వార్షికోత్సవం



ముదినేపల్లి రూరల్: మండలంలోని ప్రొద్దువాక శ్రీకృష్ణ మందిర ప్రథమ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. తొలుత స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ డైరెక్టర్ కొడాలి వినోద్ ప్రారంభించారు.

ప్రతి ఇంటిపై త్రివర్ణపతాకం ఎగరాలి

ముదినేపల్లి రూరల్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరాలని బీజేపీ నాయకులు కోరారు. మండలంలోని పెయ్యేరు ఆటో నగర్‌లో హర్‌ఘర్ తిరంగా అభియాన్ (ప్రతి ఇంటిపై త్రివర్ణపతాకం) కార్యక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి త్రివర్ణ పతాకాలు పంపిణీ చేశారు.

ఆడబిడ్డల అభ్యున్నతికి కృషి

మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌కు రాఖీ కడుతున్న తోబుట్టువు అనిత

పమిడిముక్కల: వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ అడుగుజాడల్లో నడుస్తూ, రానున్న రోజుల్లో నియోజకవర్గంలోని ఆడబిడ్డల అభ్యున్నతికి కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ హామీ ఇచ్చారు. అనిల్ స్వగృహంలో తోబుట్టువు అనితతో శనివారం రాఖీ కట్టించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంధాలన్నింటిలోను అత్యంత స్వచ్ఛమైనది అన్నాచెల్లెళ్ల అనుబంధం అన్నారు. భారతీయ సంస్కృతిని చాటిచెప్పే రాఖీ పండుగంటే తనకెంతో ఇష్టమని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అక్కచెల్లెమ్మలకు రాఖీ శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రత్యేక పూజలు



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

పామర్రు(మొవ్వ): తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ కృష్ణా జిల్లా ఆధ్వర్యంలో శ్రావణ పౌర్ణమి మహా పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం పామర్రు మండలం నిమ్మకూరులోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారి తమ్మిశెట్టి వీరనారాయణ ఆధ్వర్యంలో అర్చకులు యోగానంద లక్ష్మి నరసింహాచార్యులు పూజలు నిర్వహించారు. అనంతరం బ్రహ్మశ్రీ వడ్లమన్నాడు మారుతి శ్రావణ పౌర్ణమి విశిష్టత అంశంపై ప్రవచనం జరిగింది. సౌభాగ్యం కార్యక్రమంలో భాగంగా తిరుమల నుంచి వచ్చిన పసుపు కుంకుమలు గాజులు, రక్షా కంకణాలు, మంగళసూత్రం భక్తులకు అందజేశారు.

వైభవంగా సుదర్శన హోమం



మంటాడ వెంకన్న ఆలయంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



చండీ హోమం నిర్వహిస్తున్న అర్చకుడు శివ సంతోష్

పమిడిముక్కల: మంటాడ వెంకన్న ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శ్రీ అలివేలుమంగా పద్మావతి సమేత వైకుంఠ వెంకటేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం శ్రావణ పౌర్ణమి కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. సుదర్శన హోమం వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు భక్తులు సమర్పించిన చీరలు, పంచెలు దేవదాయశాఖ అధికారుల సమక్షంలో వేలంపాట నిర్వహించినట్లు ఈఓ సీహెచ్ హరి దుర్గానాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో సాయిపురం గ్రూపు దేవస్థానాల ఈఓ కేవీఎస్ సాయిబాబు, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రామమోహనరావు పాల్గొన్నారు.

కొండలమ్మ సన్నిధిలో చండీ హోమం

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో పౌర్ణమి సందర్భంగా శనివారం చండీ హోమాన్ని వేద మంత్రోచ్ఛరణ నడుమ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు రుద్రపాక శరశ్చంద్ర శివ సంతోష్ వేద పండితుల బృందం ఈ హోమాన్ని చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రమాదేవి

గుడివాడ టౌన్: అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కృష్ణా జిల్లా కార్యదర్శి ఎ.రమాదేవి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో యూనియన్ జిల్లా మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం అమలు చేయాలని, ఐసీడీఎస్ బడ్జెట్ పెంచి ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులు తొలగించాలని కోరారు. కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని, సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఆధార్ ధ్రువీకరణ, ముఖ గుర్తింపు వంటి యాప్‌లను తొలగించి లబ్ధిదారులకు మంచి పౌష్టికాహారం అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు ఎం. స్వర్ణలత, కోశాధికారి ఎ.నాగమణి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు కె. కృష్ణవేణి, గుడివాడ అధ్యక్ష కార్యదర్శులు వై. గీత, టి. వాణి పాల్గొన్నారు.

పశువులపాక దగ్ధం



ప్రమాదంలో కాలిపోయిన పశువుల పాక

రెండు గేదెలు మృతి

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో కాశీవిశ్వనాథ శర్మకు చెందిన పశువులపాక పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రెండు గేదలు మృతి చెందగా మూడు పశువులకు తీవ్రగాయాలయ్యాయి. ఆ మంటలు పక్కనే ఉన్న 10 ఎకరాల గడ్డివాముకు వ్యాపించటంతో అది కూడా పూర్తిగా దగ్ధమైంది. విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంతో తొలుత గేదల సావిడి కాలిపోయింది. ఆస్తి నష్టం రూ.6 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు ఉంటుందని అధికారుల అంచనా. ప్రమాద సమాచారం అందుకున్న అగ్నిమాపక కేంద్ర అధికారి కే వెంకటేశ్వరరావు సిబ్బంది సహకారంతో వెళ్లి మంటలను అదుపు చేశారు.

ఆక్వా రైతు బజారులో అగ్నిప్రమాదం



ఆక్వా రైతుబజారులో మంటలు అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

కైకలూరు: కైకలూరు సంతమార్కెట్ వద్ద వాసవి ఆక్వా రైతు బజారు గోడౌన్‌లో శుక్రవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. హైడ్రోజన్ పెరాక్సైడ్ డబ్బాల నుంచి లిక్విడ్ లీక్ అయ్యింది. వాతావరణ ఉష్ణోగ్రతలు పెరగడంతో ఒక్కసారిగా పొగలు కమ్మాయి. వెంటనే కైకలూరు అగ్నిమాపక అధికారి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో శ్రీనివాసరావు, రాకేష్ కుమార్, మురళీ మంటలను అదుపు చేశారు. సుమారు రూ.10 వేలు నష్టం వాటిల్లింది. అగ్నిమాపక సిబ్బంది మాట్లాడుతూ ఆక్వా మందుల డబ్బాలను ఎక్కువగా నిల్వ చేయవద్దని నిర్వాహకులకు సూచించారు. ఇదే గోడౌన్‌లో గతంలో అగ్నిప్రమాదాలు జరిగాయి.